# ఘటన • నందం రామారావు

తెలుగు కథానిక మ్యాజిక్ —
రాజాలక్ష్మీ ఫౌండేషన్ వారి కథల పోటీలో
బహుమతి పొందిన కథ.

శీతాకాలం కావడంవల్ల త్వరగానే చీకటి పడిపోయింది. సాయంత్రం ఏడుగంటలకే ఎంతో రాత్రయినట్టుగా వుంది.

మాచమ్మ చేతికర్ర ఆసరాతో కళ్ళు కనిపించక కుంటుకుంటూ నడుస్తోంది. ఆమె చేతిలో పళ్ళెమొకటి వుంది. ఆ పళ్ళెం ఖాళీగా వుంది!

చలిగా వుంది.

వీథి దీపాలు వెలగడంలేదు.

సందులూ, గొందులూ, పందులు, బురద.

ఏ వీధి చూసినా రోతగానే వుంది.

మాచమ్మ నెమ్మదిగా నడుచుకుంటూ వస్తోంది.

చలికి వణికిపోతోంది.

శరీరమంతా ముడతలు పడి ఎముకలు కనిపిస్తున్నాయి.

కట్టుకున్న నేత చీర చినిగిపోయింది.

చీకటిగా వుంది. నడుస్తోంది.

ఓ ఇంటిముందు ఆగింది.

"అమ్మా! కాస్త అన్నం పెట్టు తల్లీ"

"పోవే. పో... వేళా పాళా లేదు."

"కాస్త అన్నం పెట్టు తల్లీ. నీకు పుణ్యముంటుంది."

"పోవే. నీక్కాదూ చెప్పేది."

మాచమ్మ నిట్టూర్చింది. కదలలేక కదిలింది. కాళ్ళు తడబడుతున్నాయి.

అయినా, మాచమ్మ ఎలాగో నడుస్తోంది.

నడవక తప్పడం లేదు.

మాచమ్మ నడుస్తోంది.

మరో ఇంటిముందు ఆగింది.

"అమ్మా! కాస్త అన్నం పెట్టుతల్లీ. రెండు రోజులనుంచీ అన్నం లేదు."

ఆ ఇంటిలోంచి కూడా సమాధానం లేదు. అంటే మనుషుల్లేరనే అర్థం? కాదు. వున్నారు. వారంతా ఆనందంలో మునిగిపోయి వున్నారు. ఆ ఇంటి లోపల ఎవరో ఎవరిమీదనో 'జోక్' విసిరారు. నలభైయేళ్ళ స్త్రీ పమిట జారవిడుచుకుని మరీ నవ్వుతోంది!

"అమ్మా! పొద్దున్న మిగిలిందేదైనా వుంటే కాస్త అన్నం పెట్టు తల్లీ"

మాచమ్మ శక్తినంతా కూడదీసుకుని మరీ అడిగింది.

లోపల వున్నవారంతా స్వర్గానికి గజం దూరంలో వున్నారు. అంచేత, ఆ పుణ్యాత్ములకి ఈ పాపవు ఆకలి వాదం వినిపించదు. ఒకవేళ వినిపించినా పలకరు.

చలి కొరికేస్తోంది.

చేతులు కొంకర్లు పోతున్నాయి.

కాళ్ళకు రాళ్ళు గుచ్చుకుని ప్రాణం పోయినట్టుగా వుంది.

చెవుల్లో హోరుగా వుంది.

కళ్ళు తిరుగుతున్నాయి.

చాలాసేపు ఆ ఇంటిముందు మాచమ్మ నిలబడింది.

మూసివున్న ఆ ఇంటి తలుపులు తెరచుకోలేదు.

మాచమ్మ అక్కడనుండి భారంగా కదిలింది. అడుగు తీసి అడుగు వెయ్యలేకపోతోంది.

రెండురోజుల నుంచీ అన్నం లేదు.

మంచినీళ్ళు తాగి గడుపుతోంది.

పని చేసుకుని చిల్లర డబ్బులు సంపాదిద్దామన్నా వీల్లేదు.

చూపు స్పష్టంగా ఆనదు. కర్ర సహాయం లేనిదే నడవలేదు.

ఇంకేవిధంగా తనను తాను పోషించుకోగలదు?

ఇల్లు లేదు.

ఒకప్పుడుంది అద్దె ఇల్లు!

కొడుకు పోవడంతో అదీ పోయింది!

మాచమ్మ ఖాళీ పళ్ళాన్ని ఎండిపోయిన పొట్టకు ఆనించుకుంది.

అంతమాత్రాన ఆమె ఆకలి తీరుతుందా?

తీరదు!

తూలుకుంటూ తూలుకుంటూ నడిచి రోడ్డెక్కింది.

ఆ రోడ్డంతా ఎంతో అట్టహాసంగా వుంది.

సంబరంగా వుంది. కోలాహలంగా వుంది.

లైట్ల కాంతిలో ఆ ప్రదేశమంతా పట్టపగల్లా వుంది.

కార్లు, జనం... హడావుడి... పోలీసు బందోబస్తు.

వేదికమీద ఓ నాయకుడు గంభీరంగా ఉపన్యాసమిస్తున్నాడు.

"ఈనాడు మన దేశం తీవ్రమైన సంక్షోభంలో వుంది. ఎటుచూసినా అల్లర్లు ... సమ్మెలు ... నిజమే... ఈనాడు మనం కష్టాల్లో వున్నాం... అయితే, ఈ కష్టాలు కలకాలం వుండవు. నేను వచ్చే నెలలో సాంస్కృతిక ఉత్సవాల్లో పాల్గొనడానికి విదేశాలు వెడుతున్నాను. అక్కడ వారి సాంప్రదాయాలనూ, పద్ధతులనూ అవగాహన చేసుకుని..."

గుంపులో ఎవరో అంటున్నారు –

"అయ్యా! ఇప్పుడు మనకు కావలసింది మీ విదేశీ పర్యటన కాదు. మన దేశంలో ప్రజలు సుఖంగా వుండడం... ఆదాలోచించండి."

నాయకుని ఉపన్యాసం సుదీర్ఘంగా సాగుతోంది.

జనం చప్పట్లు కొడుతున్నారు.

అయ్యవారు మెళ్ళోవున్న దండలను

## జైలులో భర్త

కటకటాల ఇవతల భర్త
అవతల నిలుచుంది భార్య
ఇద్దరి మధ్యా దూరం కొన్ని అంగుళాలు
కాని అసలైన దూరం
భూమికీ, ఆకాశానికీ ఉన్నంత
వారి నోళ్ళు చెప్పలేని మాట
కళ్ళు చెప్పబోతాయి
మాట రాక ముందే
కన్నీళ్ళు స్రవిస్తాయి
వారి బాధ విజానికి
గుండెలను చీల్చేస్తుంది.



మూలం : హోచిమిన్

అనువాదం : డాక్టర్ జె. భాగ్యలక్ష్మి

చేత్తో సవరించుకుంటూ నవ్వుకుంటు న్నారు.

మాచమ్మ ఆ ఉపన్యాసం వింటూ ఆకలి మరచిపోయింది.

ఆ నాయకుడు ఎవరో కూడా గుర్తు పట్టగలిగింది.


అప్రయత్నంగా మాచమ్మ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. బావురుమని ఏడ్వాలనిపించింది.

చినిగిపోయిన చీర కొంగుతో కళ్ళు వత్తుకుంది.

సరిగ్గా సంవత్సరం క్రితం –

ఇక్కడ ఇదే వేదికమీద అసంఖ్యాకమైన జనసమూహంలో వేదికమీద మాచమ్మ బితుకు బితుకుమంటూ కూర్చుని వుంది. ఆమె మెడ నిండా దండలు. ప్రజలు జయజయధ్వానాలు. ఆనాడు ఇంతకంటే ఎక్కువమంది వున్న జన సమూహంలో. ఇప్పుడు ఉపన్యాసమిస్తున్న నాయకుడే ఆనాడు మాచమ్మను పొగుడుతూ ఇలా అన్నాడు –

"మాచమ్మ ధన్యజీవి. ఆనాడు దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహానుభావులు ప్రాణాలనర్పించారు. ఈనాడు మాచమ్మ కొడుకు మన ఉద్యమానికి అండగా నిలచి సి.ఆర్.పి. ఘాతుక చర్యలకు, తుపాకీ గుండులకూ ఎదురొడ్డి నిలిచి ప్రాణాలనర్పించాడు. నిండా ఇరవై సంవత్సరాలు నిండని ఆ బాలుడు ప్రభుత్వ దమననీతికి బలైపోయాడంటే నా ప్రాణం తల్లడిల్లిపోయింది. ఏది ఏమైనా మన లక్ష్యం మనం సాధించి తీరుతాం. అంతవరకూ విశ్రమించేదిలేదు. ఈనాడు మన సమాజానికి కావలసింది మాచమ్మలాంటి తల్లులే. కుమారుడు చనిపోయాడని శోకించక, మన ఉద్యమం సాధించబోయే విజయానికి తన కుమారుడు బలైపోయాడని తెలిసికూడా సంతోషించింది. దేశానికి ఇటువంటి వీర వనితలే కావాలి".



ఆ ఉపన్యాసానికి ఆనాడు మాచమ్మ శరీరం గగుర్పాటు చెందింది. సంతోషంగా ఆనందబాష్పాలు రాలాయి.

కొడుకు ప్రతిరోజూ రిక్షాలాగి తల్లిని పోషించేవాడు. ఒక చిన్న పూరిపాకలో అద్దెకు వుండేవారు. రిక్షా లాగితే రోజుకు ఇరవై రూపాయిలు గిట్టేది. ఆ డబ్బుతో బియ్యం, పప్పులు, ముసలి తల్లికి మందులు తీసుకొచ్చేవాడు.

ఆ వయసులో మాచమ్మకు కొడుకు కొండంత అండగా వున్నాడు.

తల్లికి ఏ మాత్రం నలతగా వున్నా, తల్లిదగ్గరే కూర్చుని సేవలు చేసేవాడు.

చిలికి చిలికి గాలివానలా ఉద్యమం తీవ్రరూపం దాల్చింది.

ప్రజా జీవితమే స్తంభించిపోయింది.

బస్సులు, రైళ్ళు, విమానాలూ ఆగిపోయాయి.

వార్తాపత్రికల నిండా ఉద్యమాన్ని గురించే.

నాయకులు సింహాల్లా గర్జించారు.

శపథాలు చేశారు!

మాచమ్మ కొడుకు నాయకుల ఉపన్యాసాలకు లొంగిపోయాడు.

తనూ ఉద్యమంలోకి వురికి అహోరాత్రులు కృషిచేశాడు.

ఆందోళనలకూ, అలజడులకూ నగరంలో 144 సెక్షన్ విధించారు.

వారం రోజులనుంచీ కొడుకు రిక్షా తొక్కడం లేదు.

అన్నం లేదు!

ఒకనాటి సాయంత్రం కొడుకు ఇంటికివస్తూ వుండగా బజారులో ఉద్యమకారుల నినాదాలు ప్రారంభమైనాయి. ఎటుచూసినా జనప్రవాహం. సి.ఆర్.పి. బలగం వచ్చింది. విజిల్స్... లాటీలూ... తుపాకులు..

జనం భయంతో పరుగెడుతున్నారు.

కొంతమంది నినాదాలిస్తున్నారు. ఆ నినాదాలిస్తున్న వారిలో మాచమ్మ కొడుకు ఒకడు.

లాటీఛార్జి, బాష్పవాయువు... ధన ధన తుపాకీల మోత.

ఎంతోమంది నడిబజారులో ప్రాణాలు వదిలారు.

అందులో మాచమ్మ కొడుకు ఒకడు.

మృతవీరుల సంస్మరణార్థం పెద్ద బహిరంగసభ ఏర్పాటుచేశారు. ఆనాటి సభలో మాచమ్మను వేదికనెక్కించి –

గతం కళ్ళముందు కనుమరుగైపోగా మాచమ్మ కళ్ళు చెమ్మగిల్లాయి.

మాచమ్మకున్న ఒక్క కొడుకు అండా పోయింది.

బ్రతుకు దుర్భరమయింది.

గడవడం కష్టమైపోగా, తన ఒక్క పొట్ట కోసం అడుక్కోవడం మొదలు పెట్టింది.

ఉద్యమం ఆగిపోయింది!

గర్జించిన నాయకులూ, శపథాలు చేసిన నాయకులూ ఎంచక్కా పదవులను అలంకరించారు.

అదిగో, ఇప్పుడు ఆ నాయకుని ఉపన్యాసం వింటోంది మాచమ్మ.

చలి ఊచి వూచి కొడుతోంది. వణకిపోతోంది. చివిగిన చీరను నిండా కప్పకుంది. అయినా, చలి శరీరాన్ని తాకకుండా వుండటం లేదు. కర్ర ఆసరాతో మరోచేత్తో ఖాళీ పళ్ళాన్ని పట్టుకుని నిలబడింది మాచమ్మ.

రోడ్డుమీద బహిరంగసభ అయిపోయింది.

జనం వెళ్ళిపోతున్నారు. నాయకుడు వేదిక దిగి కారు దగ్గరకు వచ్చాడు.

చుట్టూ చోటా నాయకులు. పోలీసులు అంగరక్షకులుగా వుండి 'అయ్య' వారికి వినయంగా దారి చూపిస్తున్నారు.

మాచమ్మ అటువేపు నడిచింది, అయ్యవారిని పలుకరించాలని. కానీ, దుమ్ము లేపుకుంటూ కారు వేగంగా ముందుకెళ్ళిపోయింది. ఆ వెనుక మరికొన్ని కారులు.

మాచమ్మ నిట్టూర్చింది. ఇక నడవలేక ఆయాసంతో ఒక అరుగుమీద కూర్చుంది.

కడుపులో ప్రేవులు మెలికలు తిరుగుతున్నాయి. ఆకలికి తాళలేకపోతోంది. పంపుదగ్గర కాసిని మంచినీళ్ళు తాగుదామనుకుంది. చలికి వ్రేళ్ళు బిగుసుకుపోతున్నాయి. అరికాళ్ళు మండుతున్నాయి.

ఇక లాభం లేదు. ఈ రాత్రికి ఎక్కడో ఒకచోట ఇంత అన్నం సంపాదించాల్సిందే.

మాచమ్మ లేచింది. కర్రను టకటకా ఆడించుకుంటూ, చూపు ఆనని దృష్టితో తడువుకుంటూ ఇంటింటికీ తిరుగుతోంది. ఎక్కడా ఒక్క మెతుక్కూడా దొరకలేదు.

చివరి ప్రయత్నంగా –

తూలుకుంటూ, వణకుతూ ఒక

దాబాముందు ఆగింది. పళ్ళాన్ని ముందుకు చాపి –

"అమ్మా! అన్నపూర్ణమ్మ తల్లీ! కాస్త అన్నం పెట్టు తల్లీ" అంది. కంఠం వణకుతోంది. చేతిలో వున్న పళ్ళెం ఏ క్షణంలోనైనా క్రింద పడేట్టుగా వుంది.

ఆ దాబాలోంచి ఏ సమాధానం రాలేదు.

కొన్ని క్షణాలు. మళ్ళీ ఆ చలిని దూసుకుంటూ –

"అమ్మా! ఆకలికీ, చలికీ తట్టుకోలేకపోతున్నాను. కాస్త అన్నం పెట్టి పుణ్యం కట్టుకో తల్లీ" మాచమ్మ దీనంగా అర్థించింది.

ఎవరూ పలకలేదు!

ఆ వీథి నిర్మానుష్యంగా వుంది. సందుచివర కరెంటు స్తంభం గుడ్డిగా వుంది.

ఎక్కడా ఏ విధమైన సందడి లేదు.

నిముషాలు గడుస్తున్నాయి.

"అమ్మా! కాస్త అన్నం పెట్టుతల్లీ"

భళ్ళున ఆ దాబా తలుపులు తెరచుకున్నాయి.

సింహంలా భయంకరంగా వున్న ఒక మనిషి బయటకొచ్చాడు.

హోదాగల ఆ అధికారి కళ్ళు కాగడాల్లా వున్నాయి.

మనిషి తూలిపోతున్నాడు.

"ఏమే ఎందుకా అరువులు. వెళ్ళు... వెళ్ళు" విస్కీ వాసన.

"బాబూ! రెండురోజుల నుంచీ అన్నం లేదు. కాస్త అన్నం పెట్టించండి."

"నీక్కాదటే చెప్పేది. వెళ్ళు."

"బాబూ! ఇవాళ ఇంత అన్నం తినకపోతే చచ్చిపోతాను. మీ కాళ్ళు పట్టుకుంటాను. అమ్మగారితో చెప్పి..."

"ఎన్నిసార్లే నీకు చెప్పేది. వెళ్ళు..."

"బాబూ! కాస్త దయతలచి ఈ ముసలిదానికి..."

బండబూతులు కూస్తూ బలమైన బూటు కాలు మాచమ్మ ఎదురొమ్ములో తగిలింది.

భయంతోనూ, బాధతోనూ మాచమ్మ ఆర్తనాదం లాటిది చేస్తూ కిందపడిపోయింది. చేతిలోవున్న కర్ర దూరంగా పళ్ళెం మరో ప్రక్క పడిపోయాయి.

మట్టిలోంచి లేవాలని ప్రయత్నించింది. రొమ్ములో తగిలిన బలమైన దెబ్బ పోటుగా వుంది. చలిగాలి వూచి వూచి కొడుతోంది. ఆ చీకటిలో కర్ర ఎక్కడ పడిందో తెలియలేదు. ఆ ప్రాంతమంతా చేత్తో తడివింది. ఆమె చేతికి కర్ర దొరకలేదు. కడుపులో ప్రేవులు చుట్టుకుపోతున్నాయి. శరీరం మెలికలు తిరుగుతోంది. కళ్ళల్లోనుంచి నీళ్ళు అదే పనిగా స్రవిస్తున్నాయి.

ఆ దాబా తలుపులు కొంచెంగా తెరచుకున్నాయి. లోపల నుంచి ఒక అందమైన యువతి ఆచ్ఛాదనం లేని శరీరంతో బయటకు తొంగిచూసింది. హోదాగల ఆ పెద్దమనిషి కోసం ఆత్రంగా ఎదురుచూస్తోంది.

ఈ రాత్రికి ఆ ఎలుగుబంటితో గడిపితేనే తెల్లారి ఆమెకు ఉద్యోగం వచ్చేది!

లేకపోతే కథ మామూలే! తల్లినీ, తమ్ముళ్ళనూ, చెల్లెళ్ళనూ పస్తులుంచాల్సిందే?

మాచమ్మ బాధగా మూలిగింది.

"ఇంకా ఇక్కడున్నావేమే. లే. లేచి పో..."

"బాబూ! నేను..."

మాచమ్మ మాట పూర్తి కాకుండానే మరోసారి బూటుకాలు కర్కశంగా తగిలింది.

అంతే –

మాచమ్మ మరి లేవలేదు.

పెద్ద ఆర్తనాదం చేసి నేలకు అంటుకుపోయింది.

చలిగాలి వీస్తూనే వుంది.

కొన్ని నిముషాల క్రితం చలికీ, ఆకలికీ అలమటించిపోయిన మాచమ్మను ఇప్పుడు చలి, ఆకలీ ఏమీ చెయ్యడం లేదు.

తెల్లవారింది.

జనమంతా ఎవరి పనుల్లో వారు మునిగిపోయారు.

మాచమ్మ శవం ఆ సందులో అలాగే పడివుంది.

కుక్కలు ఆశగా పొంచిచూస్తున్నాయి.

** ** **

రెండు రోజులు గడిచాక పేపర్లో ఒక మూలగా చిన్న వార్త –

"మాచమ్మ అనే ముసలావిడ చలికి తట్టుకోలేక ఫలానా ప్రాంతంలో చనిపోయింది –" అని. ●

# గిరిధారి కనిపించేది వట్రువసుడిలోనా? గుడిలోనా?

సరస్వతీ పుత్ర శ్రీ మాన్ పుట్టపర్తి నారాయణాచార్యుల వారి వద్ద విద్యాభ్యాసం వారి శిష్యులకొక మరపురాని మధురస్మృతి. తరగతి గదులలోని ఇరుకు వాతావరణంలో విద్యాబోధన చేయడం వారికి వచ్చేది కాదు. పాఠశాల ఆవరణలోని చెట్ల నీడలో ఆసీనులై టైంటేబుల్ ప్రకారం తన వద్దకే తరలి వచ్చే విద్యార్థులకు చదువు నేర్పడం. వారిదైన బాణీ. ఆయన మేధాసంప



త్తిని గమనించిన హెడ్మాస్టర్లు వారి ఈ పద్ధతికి అడ్డు చెప్పేవారు కాదు.

కడపలో ఆయన పని చేస్తుండగా పాఠశాల తనిఖీకి విద్యాధికారులు విచ్చేశారు. అధికార గర్వమెక్కువ, ఆడంబరాల పట్ల మక్కువ, విద్యాగంధం తక్కువ గల ఆ అధికారులు చెట్ల క్రింద ఆచార్యులవారు క్లాసులు తీసుకోవడాన్ని విమర్శిస్తూ ఆయనను తరగతి గదిలోకే పిలిపించారు. హెడ్మాస్టరుగారు ఆయన పాండిత్యాన్ని, గొప్పదనాన్నీ వారికి వివరించబోయి, విఫలురయ్యారు. ఆచార్యుల వారిచ్చిన నోట్సులను తనిఖీ చేస్తూ ఒక అధికారి "ఏమండీ ఆచార్యుల వారూ! మీ గురించి మీ హెడ్మాస్టరుగారు చాలా గొప్పగా చెప్పారు. కానీ...ఇదేమిటండీ! 'కృష్ణుడు' అని తప్పగా వ్రాయించావేమిటి పిల్లల చేత! 'క్రిష్ణుడు' అని కదా వుండాలి..." అంటూ ఇంకా ఏమేమో పిల్లల ముందు చెప్పబోగా ఆచార్యులవారు అడ్డుకొని "సార్! శ్రీ కృష్ణుడు లీలా రూపధారి మనమెలా భావిస్తే అలా అగుపడతాడు. కానీ... నాకు, నాలాంటి వారికి శ్రీకృష్ణుడు వట్రువ సుడి రూపంలోనే కనిపిస్తాడు. మహానుభావులైన మీకు 'గుడి'లో కనిపించాడేమో! కానీ పిల్లలూ! సామాన్యులమైన మనం వట్రువసుడి కృష్ణునే ఆరాధించాలి సుమా!" అంటూ సుతిమెత్తగా దెబ్బకొట్టి పాఠాన్ని ప్రారంభించారు.

– శ్రీమతి గొల్లాపిన్ని
(పాణ్యం) వసుంధరాదేవి